# వాన వెలిసింది

ఆకాశంలో చంద్రుడు తాగినవాడికి మల్లే తారట్లాడుతున్నాడు. కొత్తగా తాగినవాడు ఎరిగినవాళ్ళు ఎదురైతే మొహం చాటేసినట్టుగా, మాటిమాటికీ మబ్బుల మాటున దాక్కుంటున్నాడు. చాటుమాటు సంపాదనకి అలవాటు పడ్డ అధికారికి మల్లే కాస్సేపు కళకళలాడుతున్నాడు. మరి కాస్సేపు మసకబారి పోతున్నాడు.

ఆ మసక వెన్నెల్లో వీధి గుమ్మంలో నిలబడి అప్పటికి అరగంట నుంచీ భర్త కోసం ఎదురుచూస్తున్న అరుంధతి మొహం, క్రమంగా కళ తప్పుతోంది. అప్పటికింకా తొమ్మిది కూడా కాలేదు. కాని ఎప్పుడూ ఏడింటిలోపే ఇంటికొచ్చే భర్త ఇంకా ఎందుకు రాలేదోనని ఆమెకి ఆందోళనగా వుంది.

అరుంధతి పెళ్ళయి అప్పటికింకా ఆర్నెల్లు కూడా కాలేదు. ఆ ఊరు కాపరానికొచ్చి ముచ్చటగా మూణ్ణెల్లే అయింది.

కట్నకానుకలు అట్టే లేకపోయినా, అరుంధతి అందానికి ముచ్చటపడి ఆమెని పెళ్ళి చేసుకున్నాడు వేణుగోపాల్రావ్. మరీ అంత పెద్దదీ, మరీ అంత చిన్నదీ కాని ఆ నగరంలో – ఒక పెద్ద ప్రయివేటు కంపెనీలో అతను చేస్తున్నది చిన్న ఉద్యోగమే అయినా, అన్నీ కలిపి నెలకి మూడు వేల రూపాయలు దాకా జీతమొస్తుంది.

తను కాపరానికొచ్చిన వారం రోజులకే ఫస్టు తారీకున జీతమంతా తెచ్చి భర్త తన చేతిలో పెట్టినప్పుడు అరుంధతి ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది.

"నా జేబు ఖర్చులకి మూడు నాలుగొందలివ్వు, చాలు. మిగతా డబ్బంతా నీ ఇష్టం. నువ్వేమన్నా చేసుకో" అన్నాడు గోపాల్రావ్ ఆరోజున.

"నా మొహం, నాకెందుకండీ ఇంత డబ్బు? ఇంటి ఖర్చులకి సరిపడా ఇవ్వండి. చాలు'' అంది అరుంధతి. అయినా అతను ఒప్పుకోలేదు. అన్ని ఖర్చులూ పోగా మిగిలిన డబ్బుతో ఆమె ఇష్టమొచ్చినవి కొనుక్కోమన్నాడు; లేదా బాంకులో దాచుకోమన్నాడు.

"కొత్త కాపురం అనేది ఇంత అందంగా, ఇంత హాయిగా, ఇంత తియ్యగా వుంటుందా?" అని అనేకమార్లు అనుకుంది అరుంధతి. "మొగుడనే వాడు ఇంత మంచిగా, ఇంత ప్రేమగా వుంటాడా?" అని కూడా అనుకుంది తన మొగుణ్ణి తల్చుకుని.

సంతృప్తి, సంతోషమూ తప్ప ఏ సమస్యా లేకుండా, విరహవేదన తప్ప ఏ ఆవేదనా తెలీకుండా, ప్రణయకలహం తప్ప ఏ కష్టమూ ఎరక్కుండా, ఆ మూణ్ణెల్లూ మూడు పువ్వులూ ఆరు కాయలుగా గడిచింది అరుంధతి కాపురం. ప్రతి రోజూ ఒక పండగలా సాగింది.

రోజూ సాయంత్రం అయిదున్నరకి ఆఫీసు నుంచి బయటపడి, బస్సు కోసం ఎదురు చూస్తూ అరగంటా, బస్సులో మరో అరగంటా గడిచినా ఆరున్నర కల్లా ఇంటికి చేరతాడు గోపాల్రావ్. ఏదైనా కారణం వల్ల కాస్త ఆలస్యమైనా ఎట్టి పరిస్థితుల్లోనూ ఏడు దాటదు. ఆరు, ఆరున్నర కల్లా అన్ని పనులూ ముగించుకుని, స్నానం చేసి, ముస్తాబై, మొగుడి కోసం ఎదురు చూస్తూ వుంటుంది అరుంధతి. గోపాల్రావ్ ఇంటి కొచ్చీ రాగానే వేడి వేడి కాఫీతో పాటు ఏదో ఒక ఫలహారం కూడా వేడి వేడిగా చేసి పెడ్తుంది. అవన్నీ ఆరగించి అతను కూడా స్నానం చేశాక, ఇద్దరూ కలిసి ఏ సినిమాకో, షికారుకో, స్నేహితుల ఇళ్ళకో, కూరలు తెచ్చుకోడానికీ, మరేమైనా కొనుక్కోవడానికి మార్కెట్‌కో వెళ్ళి, అలా అలా తిరిగి ఏ తొమ్మిదింటికో తిరుగు ముఖం పడ్తారు. నెలకి ఒకటి రెండుసార్లు భోజనం కూడా బయటే చేస్తూ వుంటారు. గాలో వానో రావడమో, అనుకోకుండా ఆ సమయానికి ఇంటికెవరైనా రావడమో జరిగితే తప్ప, దాదాపు ప్రతి రోజూ ఇదే వాళ్ళ కార్యక్రమం.

"పిల్లా జెల్లా లేరు. అత్తమామలు లేరు. అడిగేవాళ్ళు లేరు. ఇహనేం, ఈవిడగారు సాయంత్రానికల్లా షోకు చేసుకుని కూర్చోవటం, ఆయన గారొచ్చి వూరంతా తిప్పుకురావటం!" అని ఇరుగు పొరుగు అమ్మలక్కలు కొందరు అసూయతో ఆడిపోసుకోవటం అరుంధతికి తెలుసు. అలాంటి మాటలు విన్నప్పుడు ఆమె బాధ పడదు. తనలో తాను చిన్నగా నవ్వుకుంటుంది. తన అదృష్టానికి తానే గర్విస్తుంది.

ఎప్పుడూ ఏడింటికల్లా ఇంటికొచ్చే గోపాల్రావ్ ఆ రాత్రి తొమ్మిదైనా రాలేదు. తొమ్మిదన్నరయినా రాలేదు. దాదాపు పది కావస్తుండగా, భర్త ఎందుకు రాలేదోనన్న భయంతో, ఏం చెయ్యాలో అర్థం కాని ఆందోళనతో, అరుంధతికి ఆపుకోలేని

ఏడుపొస్తుండగా, అప్పటివరకూ ఎదురుచూసిన ఆమె కళ్లు కాయలు కాస్తుండగా అప్పుడొచ్చాడు.

గోపాల్రావ్ ఇంట్లో అడుగు పెట్టగానే అరుంధతికి అర్థం కాని ఏదో వాసన గుప్పుమంది. అతని మాటలెందుకు తడబడుతున్నాయో, నిలకడగా అతనెందుకు నిలబడలేకపోతున్నాడో, కూడా ఆ అమాయకురాలికి చాలాసేపటి వరకూ అర్థం కాలేదు.

తను తాగుడంటే ఏమిటో ఎరగడనీ, అసలా వాసనే తెలీదనీ, అయినా ఆ వేళ ఒక ముఖ్యమైన స్నేహితుడి కోసం, అతని పుట్టిన్రోజు పార్టీలో కొద్దిగా పుచ్చుకోవలసి వచ్చిందనీ అరుంధతికి అర్థమయ్యేట్టు చెప్పడానికి, ఆ రాత్రి చాలాసేపు ప్రయత్నం చేశాడు గోపాల్రావ్. ఇదే ఆఖరుసారి, ఇంకెప్పుడూ ముట్టుకోనన్నాడు. ఆమె చేతిలో చెయ్యేసి ఒట్టేశాడు. అయినా అరుంధతి గుండె దడ చాలాసేపటి వరకూ తగ్గలేదు. అర్ధరాత్రి దాటేవరకూ నిద్ర పట్టలేదు.

★ ★ ★

తాగుడికి అలవాటు పడి ఇంటికి ఆలస్యంగా వచ్చే మగాడికి మల్లే ఆ రాత్రి చంద్రుడు ఆలస్యంగా వచ్చాడు. తాగుడెక్కువై తిండి తక్కువైనవాడికి మల్లే క్షీణదశలో వున్నాడు. అంచేత ఆ రాత్రి వెన్నెల వెలుగు కంటే చీకటే ఎక్కువగా వుంది.

అర్ధరాత్రి కావస్తోంది. అప్పుడు అరుంధతి వీధిగుమ్మంలో నిలబడి లేదు. ఇంట్లో మంచమ్మీద పది మాసాల పసివాణ్ణి పక్కలో వేసుకుని పడుకుని వుంది. ఆమె నిద్ర పోవటం లేదు. కాస్సేపు ఇంటి కప్పుకేసీ, మరి కాస్సేపు తలుపులు ఓరగా తెరిచి వుంచిన వీధి గుమ్మం కేసీ చూస్తోంది. ప్రతి రాత్రీ భర్త కోసం అలా ఎదురు చూడ్డం ఇప్పుడామెకి అలవాటయిపోయింది.

నిన్నమొన్నటి వరకూ తనంతటి అదృష్టవంతురాలు లేదనుకున్న అరుంధతి ఇప్పుడలా అనుకోవటం లేదు. సరదాలూ, షికార్లూ అక్కర్లేదు – సంసారం సజావుగా సాగితే చాలనుకుంటోంది. మొగుడు సంపాదనంతా తెచ్చి తన చేతిలో పొయ్యనక్కర్లేదు. ఇంటి ఖర్చులకిస్తే చాలనుకుంటోంది. అప్పుల కోసం తను ఇరుగుపొరుగువాళ్ళని ఆశ్రయించాల్సిన అవసరం లేకుండా అవసరాలు గడిస్తే చాలనుకుంటోంది.

గోపాల్రావ్ ఇప్పుడు ఏడింటికల్లా ఇంటికి రావడం లేదు. ఎనిమిదింటికీ, తొమ్మిదింటికీ, పదింటికీ కూడా రావటం లేదు. ఎప్పుడో ఒక రోజు తప్ప అర్ధరాత్రిలోపు అసలు రావటం లేదు. ఎంతో మంచివాడు, ఎంతో గొప్పవాడనుకున్న భర్త ఇంతలోనే ఈ రకంగా ఎందుకు మారిపోయాడో అరుంధతికి అర్థం కావడం లేదు.

మొదటిసారి తాగి వచ్చిన రోజున – తన కసలు ఆ వాసనే గిట్టదనీ, మళ్ళీ ముట్టుకోననీ భార్యకి ఒట్టు వేసి చెప్పిన గోపాల్రావ్, ఇప్పుడు రోజూ తాగుతున్నాడు. ఆఫీసు వాళ్ళంతా కలిసి పార్టీ చేసుకున్నామనీ, చెల్లెలి పెళ్ళి కుదిరినందుకు స్నేహితుడు పార్టీ ఇచ్చాడనీ, ఇవ్వాళ ఇంక్రిమెంట్ వచ్చిందనీ – ఇలాంటి కారణాలు చెప్పేవాడు మొదట్లో. సరదాగా తాగితే తప్పేముందనీ, అప్పుడప్పుడూ తాగక తప్పదనీ, అసలిటువంటి సిటీలో 'హై సొసైటీ'లో కలవాలంటే తాగాల్సిందేననీ కొన్నాళ్ళు చెప్పాడు. ఎంత తాగినా 'లిమిట్' దాటననీ, అసలెంత తాగాలో, ఎప్పుడు తాగాలో తనకి తెలిసినట్టుగా ఇంకెవరికీ తెలీదనీ ఇంకొన్నాళ్ళు చెప్పాడు.

ఇప్పుడతను ఏ కారణమూ చెప్పకుండానే, ఏ సంజాయిషీ ఇవ్వకుండానే ఇష్టమొచ్చినట్లుగా తాగుతున్నాడు. ఇష్టప్రకారం ప్రవర్తిస్తున్నాడు. ఇప్పుడతను ప్రతి నెలా జీతం తెచ్చి భార్య చేతికివ్వటం లేదు. అరుంధతి అడిగితే అప్పుడో పదీ, అప్పుడో ఇరవై ఇస్తున్నాడు. ఇప్పుడతను ప్రతి నెలా అప్పులు చేస్తున్నాడు. ఇప్పుడతనికి భార్యతో సాయంత్రపు షికార్లు లేవు. సరదాలూ, సరసాలూ లేవు. కనీసం పసివాడితో ముద్దులూ ముచ్చట్లూ కూడా లేవు.

అరుంధతి ఆశలన్నీ అడుగంటాయి. ఆమె కలలన్నీ క్రమంగా కరిగిపోయాయి. ఎప్పుడూ కళకళలాడుతూ వుండే ఆమె మొహాన ఇప్పుడు కలత మబ్బులూ, కన్నీటి చారికలూ తప్ప మరేమీ కనిపించడం లేదు.

ఆమె పురిటికి పుట్టింటికి వెళ్ళేసరికే గోపాల్రావ్‌కి తాగుడు బాగా అలవాటైంది. ఆ అలవాటు మానుకోమని అరుంధతి అతన్ని అన్ని విధాలా అర్థించింది. కాళ్ళు పట్టుకుంది. కన్నీరు మున్నీరుగా ఏడ్చింది. అయినా ఏమీ లాభం లేకపోయింది. కన్నవారింట్లో తన కన్నీరు ఎవరికీ కనబడకుండా దాచుకుంది. కన్నబిడ్డని చూసైనా అతను మారతాడేమోనని ఆశ పడింది. అయితే అయిదు మాసాల తర్వాత పండంటి బిడ్డ నెత్తుకుని కొండంత ఆశతో ఆమె తిరిగి వచ్చేసరికి – గోపాల్రావ్ తాగుడు అన్నివిధాలా హద్దు మీరింది.

ఆ రోజు అర్ధరాత్రి దాటాక, ఎప్పటిలా తప్ప తాగి వచ్చిన గోపాల్రావ్ ఇంటి కొచ్చీ రాగానే కాళ్ళయినా కడుక్కోకుండా, బట్టలయినా మార్చుకోకుండా, గోడ కానుకుని, నేల మీద చతికిలబడి కూర్చుని – "అన్నం పెట్టవే!" అని అరుంధతిని ఆజ్ఞాపించాడు. అరుంధతి కూడా అప్పటివరకూ అన్నం తిన్లేదు. భర్త ఇంటికెప్పటికి చేరతాడో తెలీక పోయినా, వచ్చాక అసలు తింటాడో తినడో తెలీకపోయినా, కమ్మటి కబుర్లు చెప్పుకుంటూ కలిసి తినటమన్నది కలలో మాటగా మారిపోయినా – అతని కోసం ఎదురు చూడటమూ, అతనొచ్చేవరకూ తనూ తినకుండా కూర్చోవటమూ మానలేకపోయింది అరుంధతి.

భర్త మాట విన్న వెంటనే లేచి, గబగబా వంటింట్లోకి వెళ్ళి పళ్ళెంలో అన్నమూ కూరా వేసుకొచ్చి అతని ముందు పెట్టింది. గ్లాసుతో నీళ్ళు తెచ్చిపెట్టింది. ఒక గిన్నెలో చారూ, మరో గిన్నెలో మజ్జిగా తెచ్చి అతని అందుబాట్లో వుంచింది. మరో పళ్ళెంలో రెండు ముద్దలు అన్నం వేసుకు తెచ్చుకుని తనూ కూర్చుంది.

అన్నమూ కూరా కలిపి, కాస్సేపు కెలికి, రెండు ముద్దలు తిన్నాక, నోట్లో వున్న అన్నమంతా ఎదురుగా వున్న భార్య మొహమ్మీదా, ఆమె పళ్ళెంలోనూ పడేట్టుగా – "థూ" అని వూశాడు గోపాల్రావ్. చివాలున లేచి, పళ్ళెం ఎదురుగా వున్న గోడకి కొట్టుకుని, అన్నం ఇల్లంతా చెల్లాచెదరుగా పడేట్టుగా ఒక్క తన్ను తన్నాడు. "ఇదసలు మనుషులు తినే కూడేనా..?" అన్నాడు. "పగలంతా కష్టపడి ఇంటికొచ్చిన మొగుడికి ఇష్టమైన కూర చేసి పెడతాం. వేడివేడిగా ఏ కోడి కూరో వండి పెడదాం అన్న జ్ఞానం వుండక్కర్లేదా...?" అన్నాడు.

ఆ పైన అనరాని మాటలన్నీ అన్నాడు. తిట్టరాని తిట్లన్నీ తిట్టాడు. అప్పటికీ కోపం చల్లారక, పెళ్ళాం గుండెల్లో ఫెడీమని తన్ని వీపు మీద అయిదారు పిడి గుద్దులు గుద్ది, దభీమని తలుపు తెరుచుకుని, బూతులు తిట్టుకుంటూ బయటికి పోయాడు.

ఆ శబ్దాలన్నిటికీ అదిరిపడి లేచిన కొడుకుని మళ్ళీ నిద్ర పుచ్చి, శబ్దం రాకుండా ఏడుస్తూ పడుకున్న అరుంధతికి ఆ రాత్రి అసలు నిద్ర పట్టలేదు.

★ ★ ★

ఆ వేళ పట్టపగలే చీకటిగా వుంది. పట్టపగ్గాల్లేకుండా పోయిన తాగుబోతులకి మల్లే కారు మబ్బులు ఆకాశమంతా అడ్డదిడ్డంగా తిరుగుతున్నాయి. సమయమూ

సందర్భమూ లేకుండా పేట్రేగిపోయిన తాగుబోతు ప్రేలాపనకి మల్లే ఉండి ఉండి ఫెళపెళమంటున్నాయి ఉరుములు. ఎన్నటికీ వదలని తాగుబోతు దరిద్రానికి మల్లే పొద్దుటే పట్టుకున్న వాన వద్దన్నా కురుస్తోంది.

అరుంధతి కొడుక్కి రెండేళ్ళొచ్చాయి. ఈ రెండేళ్ళలోనూ ఆమె జీవితంలో అనేక మార్పులొచ్చాయి. గోపాల్రావ్ ఇప్పుడు పగటి పూట కూడా తాగుతున్నాడు. పగలూ, రాత్రీ అన్న తేడా లేకుండా తాగుతున్నాడు. ఆఫీసుక్కూడా వెళ్ళకుండా తాగుతున్నాడు. అవకాశం దొరికితే ఆఫీసులోనూ తాగుతున్నాడు. దొరికిన చోటల్లా అప్పులు చేస్తున్నాడు. చేసిన అప్పులు తీర్చలేక, కొత్త అప్పులు దొరక్క, పెళ్ళాం మెళ్ళో నగలు అమ్మాడు. కట్టుకథలు చెప్పి పట్టుచీరలు కూడా పట్టుకెళ్ళాడు. చివరికి కట్టుబట్టలు తప్ప ఇంకేమీ మిగల్లేదు.

తాగుడు ఎక్కువైనప్పుడూ, తక్కువైనప్పుడూ కూడా పెళ్ళాన్ని చితకదన్నడమనేది గోపాల్రావ్ కిప్పుడు నిత్యకృత్యమై పోయింది. ఆ తన్నులు తినటం, నోరు మెదపకుండా, వంచిన తల ఎత్తకుండా, కన్నీరు కనబడకుండా, వెక్కిళ్ళు వినబడకుండా ఏడవటం అరుంధతి కిప్పుడు అలవాటై పోయింది. పచ్చడి మెతుకులు కూడా దొరకనప్పుడు పచ్చి మంచి నీళ్ళతో కడుపు నింపుకుని పస్తులు పడుకోవటం కూడా ఆమె కిప్పుడు బాగా అలవాటైంది.

మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. అప్పటికి రెండు రోజుల్నించీ ఒక్కపూట మాత్రం తింటున్న అరుంధతి ఆ పూటకి మిగిలిన చారెడు బియ్యంతో రెండు ముద్దలు వండి కొడుక్కి తినిపించింది. మరి కాస్త అన్నం మిగిలితే మొగుడి కోసం వుంచింది. తను మాత్రం మర్యాదగా మంచి నీళ్ళు తాగి, అప్పటిదాకా ఏడ్చి అంతకు ముందే పడుకున్న కొడుకు పక్కన నట్టింట్లో చాప మీద చతికిలపడి, నడికప్పుకేసి నీరసంగా, నిర్లిప్తంగా చూస్తూ కూర్చుంది. వాన ఇంకా కురుస్తూనే వుంది.

తాగటానికి పొద్దున్నే బయల్దేరి వెళ్ళిన గోపాల్రావ్ – జేబులో డబ్బున్నంత మటుకు తాగి, ఆ పైన తాగడానికి ఎక్కడా అప్పు దొరక్క ఆవురావురుమంటూ ఇంటికి తిరిగొచ్చాడు. కాస్త అన్నం వుంది పెడతాను రమ్మని పిలిచిన భార్యని నోరుముయ్యమన్నాడు.

"నీ అన్నం ఎవడిక్కావాలే బోడి లంజా..? నాకు డబ్బు కావాలి. ఎంతుంటే అంతివ్వు! అర్జెంటుగా ఇవ్వు..!'' అంటూ అరిచాడు.

ఇంట్లో ఒక్క రూపాయి కూడా లేదంది అరుంధతి. కస్సుమని లేచాడు గోపాల్రావ్.

"నేనిచ్చే డబ్బంతా ఏ రంకు మొగుడి కిస్తున్నావే లంజా..? ఎక్కడ దాచావో మర్యాదగా తీస్తావా, తన్నమంటావా..?" అంటూ ఆమె జుట్టు పట్టుకుని గుంజాడు. తల పట్టుకుని గోడకేసి కొట్టాడు. ఏమీ చెయ్యలేక ఆమె ఏడుస్తుంటే – "ఏడ్చావంటే చంపేస్తా, ఏడుపుగొట్టు లంజా..!" అని మళ్ళీ కొట్టాడు.

ఆ తర్వాత ఆమె నక్కడ కూలదోసి, ఇల్లంతా తిరిగాడు. పెట్టెలూ, డబ్బాలూ, కుండలూ, చట్లూ అన్నీ వెతికాడు. ఎక్కడా ఏమీ దొరకలేదు. దాంతో మరీ రెచ్చిపోయాడు. రెట్టించిన కోపంతో ఇల్లంతా లేచిపోయేట్లు అరుస్తూ, మళ్ళీ అరుంధతి మీద పడి, ఎక్కడ తగులుతుందో, ఏమౌతుందోనన్న జ్ఞానం కూడా లేకుండా ఆమెను తన్నటం ప్రారంభించాడు.

ఈ గొడవకి ఉలిక్కిపడి లేచిన పసివాడు కళ్ళు తెరిచి – తల్లిని కింద పడవేసి తన్నుతున్న తండ్రిని చూసి జడుసుకుని, బిగ్గరగా ఏడవటం మొదలెట్టాడు. గోపాల్రావ్ కోపం అరుంధతి మీద నుంచి అకస్మాత్తుగా కొడుకు మీదకి మళ్ళింది.

"నోర్ముయ్‌రా! లంజా కొడకా...! నువ్వొకడివి నాకు శనిలా దాపురించావ్! నువ్వు పుట్టాకే నాకు దరిద్రం పట్టుకుంది. నువ్వసలు నా కొడుకువే కాదు. నీ అమ్మ ఎవడికి కందో రంకుముండ! నోరుముయ్యకపోతే పీక పిసికేస్తా.." అంటూ గభాలున వెళ్ళి రెండుచేతుల్తోనూ ఆ పసివాడి పీక పట్టుకుని నొక్కటం ప్రారంభించాడు.

అది చూసిన అరుంధతి కెవ్వుమని అరిచింది. ఒక్క ఉదుటున లేచి వెళ్ళి భర్తచేతులూ రెండూ పట్టుకుని, అతన్ని పట్టు విడిపించడానికి ప్రయత్నించింది. వారంలో సగం రోజుల ఉపవాసాలతో, రోజూ భర్త కొట్టే చావు దెబ్బలతో, ఏ రోజూ కంటి నిండా పట్టని నిద్రతో, ఎన్ని రోజులు ఏడ్చినా తరగని శోకంతో శల్యావశిష్టంగా మిగిలిన అరుంధతికి – తాగుడు పిచ్చితో పిచ్చెత్తినట్టుగా, పిశాచం పట్టినట్టుగా వ్యవహరిస్తున్న గోపాల్రావ్ పట్టు నుంచి బిడ్డని విడిపించడానికి బలం చాల్లేదు.

కన్నబిడ్డ వూపిరాడక తన్నుకుంటూ కళ్ళు తేలవెయ్యడం చూసిన అరుంధతి ఇంక చూస్తూ వూరుకోలేక పోయింది. ఒక్కసారి చుట్టూ చూసింది. ఆ రోజు ఉదయం గోడకి మేకు కొట్టి, అక్కడే పడవేసిన పచ్చడి బండ కనిపించింది. కన్ను మూసి

తెరిచేంతలో అది పట్టుకొచ్చి, వొంట్లో వున్న శక్తి అంతటినీ చేతుల్లోకి తెచ్చుకుని, భర్త తల మీద బలంగా కొట్టింది.

పిడుగుపాటుకి కూలిన చెట్టుకి మల్లే ఉన్నపాటున నేల మీదకి వొరిగి పోయాడు గోపాల్రావ్. అతని తల కొబ్బరి కాయ పగిలినట్లు పగిలింది. రక్తం చివ్వున చిమ్మింది.

అప్పటి కింకా తేరుకోకుండా, ఏడ్చే శక్తి కూడా లేకుండా, ఎగశ్వాసతో గుడ్లప్పగించి తల్లి వంక తెల్లబోయి చూస్తున్న కొడుకుని గుండెలకి హత్తుకుని, వెనక్కి తిరిగి చూడకుండా గబగబా బయటికి నడిచింది అరుంధతి.

అప్పటికి వాన పూర్తిగా తగ్గింది.

ం

*(ఆంధ్రదేశంలో మద్యపానానికి వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించిన సందర్భంలో రాసిన కథ)*

*(రచన ఇంటింటి పత్రిక – ఫిబ్రవరి 1995)*